

క్లుప్తంగా

కారుణ్య నియామకం



ఐనవోలు : మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో కారుణ్య నియామకం కింద కొత్తూరి అభిషేక్‌కు ఉద్యోగం కల్పించినట్టు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ మేరకు ఎండోమెంట్ కమిషనర్ విడుదల చేసిన కారుణ్య నియామక ఉత్తర్వుల మేరకు నియామక పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. 2022 ఫిబ్రవరి 4న ఆలయంలో నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో కొత్తూరి అశోక్ మృతి చెందిన క్రమంలో ఆయన కొడుకు అభిషేక్‌కు ఉద్యోగం లభించిందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, వేద పండితులు వినాయక్ జోషి, జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నడికూడ : మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కొడపాక నరేష్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.15,500లు సాయం అందించారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు రాచమల్ల నరేష్, అల్లం వజ్రం, కొడపాక సురేష్, నాగరాజు, రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్ : పరకాల, శాయంపేట, నడికూడ, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్, దామెర, ఆత్మకూరు, ఐనవోలు, ధర్మసాగర్, ఐనవోలు మండలాల్లో జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. పరకాలలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత రామకృష్ణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ జెండా ఎగరేశారు. అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో, గ్రామ పంచాయతీల్లో, ముఖ్య కూడళ్లలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, పీహెచ్‌సీల్లో వైద్యులు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జాతీయ జెండాకు వందనం చేశారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడారు. జాతీయ సమైక్యతా దినతోవ్స విశిష్టతను వివరించారు. నాటి పోరాట యోధులకు ఘనంగా నివాళులర్పించారు.



పరకాల : జెండా ఎగరేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

బీఆర్‌ఎస్ హయాంలోనే సుపరిపాలన

● భూపాలపల్లి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

శాయంపేట : బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందుతోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు సుమారు 50 మంది ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. సమైక్య పాలనలో తెలంగాణ అభివృద్ధిని పాలకులు విస్మరించారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ అన్ని తరగతుల ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలనే కాకుండా ప్రజలు అడగకున్నా కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లాంటి అనేక పథకాలు తీసుకొచ్చి పేదలను ఆదుకుంటున్నారని చెప్పారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలు వెచ్చించి అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఈ క్రమంలో ఇతర పార్టీల నుంచి భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ముందుకొస్తున్నారని వివరించారు. పార్టీ శ్రేణులకు నిత్యం అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు సామల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ఊరూరా విమోచన దినోత్సవం

పరకాల/కమలాపూర్/ధర్మసాగర్ : పరకాల, కమలాపూర్, ధర్మసాగర్ మండలాల్లో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాలలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి జెండా ఎగరేసి నివాళులర్పించి మాట్లాడారు. విమోచనాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.



పరకాల : జెండా వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి

కమిటీ ఎన్నిక

ఐనవోలు : మండలంలోని ముల్కలగూడెం గ్రామంలో బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, దుర్గామాత ఉత్సవ కమిటీని 25 మందితో ఆదివారం ఎన్నుకున్నట్టు సర్పంచ్ బండి పర్వతాలు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా బండి పర్వతాలు, అధ్యక్షుడిగా జున్ను ఐలయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడిగా గుండెకారి కరుణాకర్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

ఎల్కతుర్తి : గణపతి నవరాత్రుల సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని ఎంపీపీ మేకల స్వప్న కోరారు. తెలంగాణ ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పంపించిన వినాయకుడి మట్టి విగ్రహాలను భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో ప్రజలకు ఆదివారం ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగ రవీందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, సమ్మయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, సర్పంచ్ నిరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

కమలాపూర్ : వినాయకుడి మట్టి విగ్రహాలను ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్ ప్రజలకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కల్యాణి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, సర్పంచ్ విజయ తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలతో ఆరోగ్య పరిరక్షణ

దామెర : వైద్యశిబిరాలను వినియోగించుకుని రోగాల నుంచి రక్షించుకోవాలని ఊరుగొండ సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి చెప్పారు. హనుమకొండకు చెందిన శిరీష్మ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ యేలె శిరీష్మ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జున్ను విద్యాసాగర్, బీజేపీ సీనియర్ నాయకుడు వీసం రమణారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కూనాటి సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మందులు అందిస్తున్న వైద్యులు

ఆలయానికి మైక్ సెట్ బహూకరణ

దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామంలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయం కోసం గ్రామానికి చెందిన శ్రీ సాయి బిల్డర్స్ యజమానులు ఇట్టబోయిన కుమరస్వామి, ఆరెల్లి రాజేష్ కుమార్ ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసచారికి మైక్ సెట్‌ను ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా కుమారస్వామి, రాజేష్‌కుమార్‌లను అర్చకుడు శ్రీనివాసచారి అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.



'విజయభేరి'కి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

సాక్షి నెట్‌వర్క్ : శాయంపేట, దామెర, ఐనవోలు, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, తదితర మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని తుక్కుగూడలో తలపెట్టిన విజయభేరి సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బస్సులను నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. 'జై కాంగ్రెస్.. జైజై కాంగ్రెస్' అంటూ నినాదాలు చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



నడికూడ : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఏఓ శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండలంలోని ఫెర్టిలైజర్ షాపుల్లో ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుగు మందులు, రికార్డులు, క్యూఆర్ కోడ్‌లు, లేబుళ్లను నిశితంగా పరిశీలించారు. అనంతరం షాపుల యజమానులతో మాట్లాడారు. పురుగు మందులు, యూరియా, ఇతరత్రా విక్రయించినప్పుడు రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని చెప్పారు. కృత్రిమ యూరియ కొరత సృష్టించొద్దని, అధిక ధరలకు ఎరువులు విక్రయించొద్దన్నారు. తనిఖీలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కమలాపూర్ /దామెర : గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని కమలాపూర్ ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్, దామెర, శాయంపేట ఎస్సైలు ముత్యం రాజేందర్, దేవేందర్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో వేర్వేరుగా మాట్లాడారు. మండప ఏర్పాటుకు సంబంధించి స్థల యజమాని అనుమతితోపాటు విద్యుత్, పోలీసు శాఖల నుంచి ముందస్తుగానే తప్పనిసరిగా అనుమతి పొందాలని చెప్పారు. వినాయక విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, విగ్రహ ఎత్తు, నిమజ్జనం చేసే తేదీ, నిర్వహణ కమిటీ సభ్యుల వివరాలతో కూడిన సమాచారంతో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసి అందుకు సంబంధించిన ప్రతులను పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలన్నారు. వివరాల కోసం సెల్ నంబర్ 8712685125లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ అనుమతి ఉండాల్సిందే

ధర్మసాగర్/శాయంపేట/ఆత్మకూరు : వినాయక మండపాలకు విద్యుత్ శాఖ నుంచి అనుమతి తప్పనిసరి అని నారాయణగిరి ఆ శాఖ ధర్మసాగర్, శాయంపపేట, ఆత్మకూరు ఏఈలు కుమారస్వామి, రాజ్‌కుమార్, రవికుమార్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మండపాలకు వినియోగించే లోడ్‌కు ఫీజు చెల్లించి అనుమతి పొందాలని పేర్కొన్నారు. వెయ్యి వాట్స్ వరకు రూ.1560లు, వెయ్యి నుండి 1500 వరకు రూ.2300లు, 1500 నుంచి రెండు వేల వరకు రూ.3020లు, 2 వేల వాట్లకు మించితే రూ.3020లతోపాటు ప్రతీ అదనపు వెయ్యి వాట్లకు రూ.1560లు చొప్పున చెల్లించాలని సూచించారు. నాణ్యమైన వైర్లను, స్విచ్‌లను వినియోగించాలని కోరారు. సమస్యలు ఎదురైతే విద్యుత్ శాఖ ఉద్యోగులకు సమాచారం ఇవ్వాలని తేటతెల్లం చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

పరకాల : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకను పట్టణంలో బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం సివిల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిరంగి సంతోష్‌కుమార్, కాచం గురుప్రసాద్, రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, కౌన్సిలర్ పూర్ణాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర స్థాయి అవార్డు సాధించిన సర్పంచ్ పర్వతగిరి రాజును సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సదానందం, కార్యదర్శి పైడి, కిసాన్ సెల్ కన్వీనర్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరకాల : రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

కమ్యూనిస్టులే సాయుధ పోరాట వారసులు

ఐనవోలు : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద అమరుల చిత్రపటాలకు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లింగయ్య మాట్లాడారు. భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోందని మండిపడ్డారు. నాడు పోరాడింది కమ్యూనిస్టులు మాత్రమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండెకారి మహేందర్, రాంకుమార్, మేకిరి మోహన్‌రావు, రాయపురం కొంరయ్య, లెంకలపెల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న లింగయ్య, తదితరులు

ఐక్యతతోనే ముదిరాజ్ కులస్తుల అభివృద్ధి

పరకాల : ఐక్యతతోనే ముదిరాజ్ కులస్తుల అభివృద్ధి సాధ్యమౌతుందని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ తెలిపారు. పట్టణంలోని అమరవీరుల స్మారక భవన్‌లో జిల్లా అధ్యక్షుడు భూమ భిక్షపతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల సమావేశానికి దేవేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజ్ కులస్తుల బలోపేతానికి రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా అల్లె దశరథం, ప్రధాన కార్యదర్శిగా వీర్ల భాస్కర్, కోశాధికారిగా సురుగురి రాజేందర్, ఉపాధ్యక్షుడిగా కుక్కల విజయ్, సంయుక్త కార్యదర్శిగా గండి రమేష్, వీర్లకృష్ణ, సాదు సర్వేషం, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



అధ్యక్షుడు దశరథం